సాక్షి కర్నూలు

ఆదివారం । 2 । మార్చి । 2025



.. జల వివాదం

అనుమతి లేకుండా కర్ణాటక రిజర్వాయర్‌కు నీరు మళ్లించేందుకు జేసీబీలతో తుంగభద్ర దిగువ కాలువ తవ్వుతుండగా జిల్లా అధికారులు అడ్డుకున్నారు. 8లో▸



రూ.5 లక్షల రుణాలకు వడ్డీ రాయితీ

రూ.5 లక్షల వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీ లభిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. శనివారం న్యూఢిల్లీ నుంచి వెబ్‌నార్‌లో ప్రధాని మాట్లాడారు. 8లో▸



శ్రీశైలం.. పుష్పశోభితం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. పలు రకాల సుగంధ పుష్పాలతో స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం చేశారు.

న్యూస్‌రీల్

నేడు ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కర్నూలు(అర్బన్): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశాలకు ఎంట్రెన్స్ టెస్ట్ ఈ నెల 2న నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి కె.తులసీదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షకు జిల్లాకు చెందిన 41 మంది బాల బాలికలు దరఖాస్తు చేసుకున్నారని, వీరందరికి స్థానిక బి.క్యాంప్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు.

రేపటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

కర్నూలు సిటీ: జిల్లా సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్) ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యాసకులు https://www.apopenschool.ap.gov.in అనే వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకొని స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ సంతకం చేయించుకోవాలన్నారు. పరీక్షలకు 9 కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,239 మంది అభ్యాసకులు హాజరవుతున్నారన్నారు. అభ్యాసకుల అనుమానాల నివృత్తికి డీఈఓ ఆఫీస్‌లో 9966562862, 9398128893 నెంబర్లతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

అగ్నిమాపక సిబ్బంది యూనిఫాంలో మార్పులు



మార్పు చేసిన యూనిఫాం ధరించిన సిబ్బంది

కర్నూలు: అగ్నిమాపక శాఖలో లీడింగ్ ఫైర్‌మెన్, డ్రైవర్, ఆపరేటర్, ఫైర్‌మెన్‌ల యూనిఫాంలో స్వల్ప మార్పు చేశారు. ఆయా హోదాల్లోని ఉద్యోగులు నేవీ బ్లూ కలర్ క్యాప్(టోపీ), ఆలివ్ కొమ్మల గుర్తుతో కూడిన నలుపు రంగు బెల్టు ధరించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి అవినాష్ జయసింహ చేతుల మీదుగా అందుకున్న నూతన యూనిఫాంను సిబ్బంది ధరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, కర్నూలు కేంద్ర ప్రతినిధి చింతల రామాంజనేయులు, లీడింగ్ ఫైర్‌మెన్లు వెంకటరాముడు, నరేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలున్న ప్రజలు వినతులను సమర్పించుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వీధికెక్కి.. విల పింఛన్



తుగ్గలి మండలం ఆర్ కొట్టాలలో వీధిలోనే పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎక్కడపడితే అక్కడే..

తుగ్గలి: పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల కూడా కష్టాలు తప్పలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెల నెలా లబ్ధిదారుల ఇంటి వద్దకే వలంటీర్లు వెళ్లి పింఛన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. తుగ్గలి మండలంలోని ఆర్ కొట్టాల గ్రామంలో శనివారం మూడు చోట్ల పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో వృద్ధులు, దివ్యాంగులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ ఎక్కడా కనిపించలేదు. లబ్ధిదారుల ఇంటి నుంచి 300 మీటర్ల దూరంలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినా పింఛన్ అందలేదు. అన్ని చోట్లా అవ్వతాతల, దివ్యాంగుల అవస్థలే దర్శనమిచ్చాయి. ప్రచారంలో భాగంగా 20 సెకండ్ల నిడివి కలిగిన ఆడియోను వినిపించాల్సి ఉండటంతో పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. సర్వర్ సమస్యతో పలు మండలాల్లో లబ్ధిదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వచ్చింది.

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో అస్తవ్యస్తంగా పింఛన్ల పంపిణీ
- సచివాలయాలకు వెళ్లి నిరీక్షించినా అందని 'భరోసా'
- సర్వర్ సమస్యతో పింఛన్ల పంపిణీ ప్రక్రియలో జాప్యం
- రచ్చబండల దగ్గర, చెట్ల కింద తప్పని ఎదురుచూపులు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న అవ్వతాతలు, దివ్యాంగులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం మార్చి నెల పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. చాలా గ్రామాల్లో రచ్చబండలు, వీధుల్లోకి రప్పించి పంపిణీ చేయడం చూసి అవ్వతాతలు నోరెళ్లబెట్టారు. పడిగాపులు కాసి అతి కష్టం మీద పింఛన్లు తీసుకున్నారు. పలువురు సచివాలయ ఉద్యోగులు కొందరు ఉదయం ఏడు గంటలకే పింఛన్ లబ్ధిదారుల ఇంటి దగ్గరకే వెళ్లినా సర్వర్ సమస్య వచ్చింది. దీంతో అందరినీ ఒకేచోట పిలిపించి పంపిణీ చేపట్టారు. దివ్యాంగులు, వృద్ధులు అతి కష్టం మీద పింఛన్లు ఎక్కడ పంపిణీ చేస్తున్నారో తెలుసుకొని వెళ్లాల్సి వచ్చింది. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మంత్రాలయంలో, మంత్రి టీజీ భరత్ కర్నూలు నగరంలో పింఛన్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ వైపీ రమణారెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలో 2,38,798 పింఛన్లు ఉండగా 2,25,767 పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,15,031 పింఛన్లు ఉండగా 2,00,936 పంపిణీ చేశారు.

అంతా అస్తవ్యస్తం

పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. కల్లూరు, కోడుమూరు, సి.బెళగల్, కర్నూలు, ఆదోని తదితర ప్రాంతాల్లో ఇంటిదగ్గర పింఛన్ల పంపిణీ కేవలం నామమాత్రానికే పరిమితం అయింది. ఎక్కువ మంది సచివాలయాలకే వెళ్లి పింఛన్లు తెచ్చుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇచ్చేవారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు సంతోషం వ్యక్తం చేసేవారు. పింఛన్ల పంపిణీ వారం రోజుల పాటు కొనసాగేది. దూర ప్రాంతాల్లో ఉండేవారికి, ఆసుపత్రుల్లో చికిత్స పొందేవారికి వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వంలో ఈ పరిస్థితులు లేవు. రచ్చబండల దగ్గర, చెట్లకింద, వీధుల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. దీంతో అవ్వతాతలకు, దివ్యాంగులకు తిప్పలు తప్పడం లేదు.

ప్రభుత్వ హంగామే!

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ వీడియోను లబ్ధిదారులకు చూపడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వేలాది మంది దివ్యాంగులు, వృద్ధులు వచ్చినా వారికి వెంటనే పింఛన్లు ఇవ్వలేదు. అవ్వతాతలు చాలా సమయం వేచి ఉండాల్సి వచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చాలా మండలాల్లో ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ నామమాత్రంగా సాగింది.

కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీ వీధిలో పింఛన్ల కోసం నిల్చున్న లబ్ధిదారులు



కనిపించని 'భరోసా'

కొలిమిగుండ్ల: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నామమాత్రంగా పంపిణీ చేస్తున్నారు. సిగ్నల్ సమస్య, ఇతర కారణాలతో వీధులు, రచ్చబండల వద్ద కూర్చొని పింఛన్ అందిస్తున్నారు. శనివారం ఉదయం ఏడు గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చారు. అలాగే ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ వాయిస్ రికార్డ్ వినిపించాలని ఉత్తర్వులు ఇచ్చారు. చాలా గ్రామాల్లో వీధుల్లోనే పింఛన్లు పంపిణీ చేశారు. అవ్వాతాతలు, దివ్యాంగులు తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు.

వీధి చివరన ఎదురుచూపు



సి.బెళగల్లో వీధి చివరన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ

సి.బెళగల్: మండలంలో పింఛన్ పొందేందుకు లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం ఉదయం ఏడు గంటల అనంతరం కొంతమంది అధికారులు పింఛన్‌ను అందజేశారు. అయితే కొంతమంది అధికారులు గ్రామాలకు ఆలస్యంగా చేరుకోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు. అవ్వాతాతలు వీధి చివరలోని అరుగులను ఆశ్రయించారు. అధికారులు సైతం ఒకే చోట కూర్చుని అక్కడికే లబ్ధిదారులను పిలుపించుకుని పింఛన్ పంపిణీ చేశారు. మండల కేంద్రం సి.బెళగల్లో పాల కెనరా బ్యాంక్ దగ్గరున్న దుకాణం దగ్గర, తెలుగు వీధిలోని మసీద్ దగ్గర, కొంతమంది వీధి చివరన అరుగుల మీద కూర్చుని పంపిణీ చేశారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తజన సందోహం

శ్రీమఠం... 'గురు' వైభవం

శ్రీరాఘవేంద్రస్వామి గురుభక్తి వైభవోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ మఠంలో భారీ భక్తజనం మధ్య బంగారు నాణేలు, పుష్పాలతో స్వామి పాదుకలకు ప్రత్యేక అభిషేకం చేపట్టారు. అలాగే బంగారు రథయాత్ర చేపట్టారు. ఉత్సవాలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేశారు.

–మంత్రాలయం




బంగారు పాదుకలకు అభిషేకం చేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు

ఆధ్యాత్మిక 'నెల'వంక

- నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు షురూ
- నెల రోజులు దైవ చింతనలో గడపనున్న ముస్లింలు
- ఉచిత సహెరీ ఏర్పాట్లు చేసిన స్వచ్ఛంద సంస్థలు

కర్నూలు కల్చరల్: ముస్లింల పవిత్ర మాసం రంజాన్. దీంతో నెల రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో వారు పర్వదినాన్ని జరుపుకుంటారు. మానవాళికి మార్గదర్శనం చేసే ఖురాన్ సైతం ఈనెలలోనే అవతరించింది. ఎన్నో విశేషాలు కలిగిన ఈ మాసం శనివారం ఆకాశంలో నెలవంక కనిపించడతో ప్రారంభమైంది. 'చాంద్ దిఖ్ గయా' అంటూ ఒకరి నొకరు ముబారక్ చెప్పుకున్నారు. తర్వాత కొద్దిసేపటికే కర్నూలులో అవుట్ పేలడంతో రాత్రి మొదటి తరావీహ్ నమాజు చేసుకున్నారు. నేటి నుంచి నెల రోజుల పాటు ఉపవాసాలు (రోజా) పాటించనున్నారు. నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు హిలాల్ కమిటీ ప్రకటించింది.



కర్నూలు నగరంలో కనిపించిన నెలవంక

ఫొటో: డి. హుస్సేన్

మాసమంతా ఆధ్యాత్మిక చింతన

'రంజాన్ మాసం' ప్రతి ముస్లిం అల్లాహ్ నుంచి వరాలు అందుకునే సౌభాగ్యం కల్పించే నెల. కఠోర దీక్ష, చిత్తశుద్ధితో అల్లాహ్‌ను ప్రార్థించిన వారికి చక్కటి జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తుంది. అందుకే ఈ పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. ఉపవాసాలు ఉండడంతో పాటు రోజుకు ఐదు పూటలు నమాజు చదువుతారు. రోజూ ఖురాన్ పఠనం లేదా శ్రవణం చేస్తారు. ఇలా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతోపాటు పరిహారం లభిస్తుందని ముస్లిం మత పెద్దలు చెబుతారు.

ఉచిత సహెరీకి ఏర్పాట్లు

ఉపవాస దీక్షల సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు సహెరీ ఏర్పాట్లు చేశారు. కర్నూలు నగరంలోని లాల్ మసీదు వద్ద ఉన్న ఖూబ్‌సూరత్ మసీదులో, పెద్దమార్కెట్ వద్ద ఉన్న నూరానీ మసీదులో, ఖడక్‌పురలో ఉన్న డాక్టర్ మియా హత్తి (ఏనుగు) బీడీ ఫ్యాక్టరీలో, కొత్తపేటలో ఉన్న హజరత్ మౌలా మిష్కిన్ మసీదులో, కొత్తపేటలోని ఖాదుమియా మసీదులో, సి.క్యాంప్ సెంటర్‌లోని మామూర్ మసీదులో, అబ్బాస్ నగర్‌లోని యూనిఖ్ స్కూల్ వద్ద ఉన్న అబ్బాస్ మసీదులో సహెరీ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



కర్నూలులోని పరీక్ష కేంద్రంలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు

- తొలి రోజు 611 మంది విద్యార్థుల గైర్హాజరు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్లతో ఆలయాల్లో పూజలు చేయించుకుని మొదటి సంవత్సర పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి కనిపించింది. ఉదయం 8.15 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. నిర్దేశించిన సమయం 9 గంటలలోపే పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఎనిమిది రూట్లలో అదనపు రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. కేంద్రాల దగ్గర ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 144 సెక్షన్ అమలు చేశారు. శనివారం మొదటి సంవత్సర విద్యార్థులు జనరల్ విభాగం విద్యార్థులు 21,462 మందికిగాను 20,984 మంది హాజరై 478 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగానికి చెందిన విద్యార్థులు 2,293 మందికిగాను 2,160 మంది హాజరు కాగా 133 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి, డీవీఈఓ వై.పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్.. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటూ..

ఎన్నాళ్లీ 'దారి'ద్ర్యం!

- 'పల్లె పండుగ' రోడ్లు వేసినా అందని బిల్లులు
- సంక్రాతి అన్నారు.. శివరాత్రి కూడా పాయే!
- రూ.55 కోట్లకు విడుదలైంది రూ.14 కోట్లు మాత్రమే
- అదే దారిలో నాబార్డు పనులు
- ఆందోళనలో కాంట్రాక్టర్లు

కర్నూలు(అర్బన్): అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం రోడ్ల పనులపై హడావిడి చేసింది. పల్లె పండుగ వారోత్సవాలంటూ.. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులను విడుదల చేస్తామని ప్రకటించింది. ఈ పనులన్నింటినీ సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని నిర్ణీత లక్ష్యాన్ని విధించింది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఇప్పటి వరకు రూ.67.58 కోట్ల అంచనాతో చేపట్టిన మొత్తం 830 రోడ్లలో 814 రోడ్లను పూర్తి చేశారు. చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.55 కోట్లను విడుదల చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.14 కోట్లను మాత్రమే విడుదల చేసింది. సంక్రాంతి పండుగ నాటికి అన్ని రోడ్లు పూర్తి చేయాలని, బిల్లులను కూడా సకాలంలో విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం శివరాత్రి పండుగ పోయినా కూడా బిల్లులను విడుదల చేయలేదు. పల్లెల్లో ఆయా సీసీ రోడ్ల పనులను చేపట్టిన చిన్న చితకా కాంట్రాక్టర్లు బిల్లులు ఎప్పుడు విడుదలవుతాయోనని గగ్గోలు పెడుతున్నారు.

నయాపైసా ఇవ్వకుండా..

గత ప్రభుత్వంలో అగ్రిమెంట్ అయి చేపట్టిన నాబార్డు పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం నేటి వరకు నయాపైసా బిల్లులను చెల్లించలేదు. జిల్లాకు మొత్తం నాబార్డు కిందరూ.61.40 కోట్లతో మొత్తం 12 పనులు (98.09 కిలోమీటర్లు) చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటి వరకు రెండు పనులు పూర్తి కాగా, మిగిలిన 10 పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. 12 పనులకు సంబంధించి రూ.38.13 కోట్ల పనులను పూర్తి చేశారు. అయితే ఈ పనులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లులు విడుదల కాకపోవడం వల్ల ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనుల్లో కోడుమూరు మండలం క్రిష్ణాపురం, కర్నూలు మండలం కేజీ రోడ్డు నుంచి కళ్లబావాపురం వయా పడిదెంపాడు, పూడురు రోడ్ల పనులు పూర్తి కాగా, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. పనులను పూర్తి చేసిన వారితో పాటు వివిధ దశల్లో పనులను చేస్తున్న కాంట్రాక్టర్లు సైతం బిల్లుల విడుదలలో జరుగుతున్న జాప్యం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పని పూర్తి చేసి ఆరు నెలలైనా...

ఈ చిత్రంలో కనిపిస్తున్నది కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు. 4.10 కిలోమీటర్ల ఈ రోడ్డును బాగు చేసేందుకు రూ.2.97 కోట్లు వెచ్చించారు. పని పూర్తి చేసి ఆరు నెలలు గడుస్తున్నా, నేటి వరకు కూటమి ప్రభుత్వం నయా పైసా బిల్లు విడుదల చేయలేదు. అలాగే కర్నూలు మండలం పడిదెంపాడు, పూడూరు మీదుగా కోళ్ల బావాపురం వరకు (14.58 కి.మీ), రూ.11.85 కోట్లు ఖర్చు చేసి రోడ్డు నిర్మించినా, నేటి వరకు ఒక్క రూపాయ బిల్లు కూడా విడుదల కాలేదు.



ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులు

ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం



పల్లె పండుగ వారోత్సవాలు, నాబార్డు కింద చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మార్చి మొదటి వారంలో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. చేసిన పనులకు చేసినట్లుగా ఎంబుక్ రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేస్తున్నాం. కాంట్రాక్టర్లు ఎవరూ ఆందోళన పడకుండా చేపట్టిన పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలి. బిల్లుల చెల్లింపు విషయంపై ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూనే ఉన్నాం.

– వీ రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ

క్లుప్తంగా

ఉర్దూ కాలేజీలో అడ్మిషన్లు

కర్నూలు సిటీ: ఏపీ ఉర్దూ గురుకుల కాలేజీ (బాలురు) ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.బుబాసిర్ బేగమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ మాతృభాష గల మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. ఇంటర్మీడియెట్ అడ్మి షన్ల కోసం వచ్చే నెల 24వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. కాలేజీలో ఉర్దూ మీడియం తో పాటు, ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీ సీ, సీఈసీ గ్రూప్‌లు ఉన్నాయని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో రోజా దర్గా ఉరుసు



దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్న పీఠాధిపతి సయ్యద్‌షా దాదా బాషా ఖాద్రి

కర్నూలు కల్చరల్: రోజా దర్గా ఉరుసు శని వారం ఘనంగా జరిగింది. కర్నూలు నగరం తుం గభద్ర నది ఒడ్డున వెలసిన సయ్యద్ షా ఇషాఖి సనావుల్లా ఖాద్రి (రోజా) దర్గాకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణ, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చి దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లిం చుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా దాదా బాషా ఖాద్రీ చర్యలు తీసుకున్నారు. దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉరుసు సందర్భం గా శనివారం రాత్రి ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. పలువురు రాజకీయ ప్రముఖులు దర్గాను దర్శించుకున్నారు. నేడు ప్రత్యేక జియా రత్ ఫాతెహాలతో ఉత్సవాలు ముగుస్తాయని పీఠాధిపతి తెలిపారు.

పాడి పశువులకు టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): పశువుల్లో గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణకు ఈనెల 30 వరకు టీకాలు వేయనున్నట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు తెలి పారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీకాల కార్యక్రమం మొదలైందన్నారు.


వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

నందవరం: వరకట్నం తేవాలని భర్త, అత్తింటి వారు వేధిస్తుండటంతో భరించలేక స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఆశీర్వాదమ్మ (26) శనివారం వేకువజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కుంది. ఎస్ఐ శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఆశీర్వాదమ్మ, మాదన్న ప్రేమిం చుకుని పెద్దల అంగీకారంతో వివాహం చేసుకు న్నారు. రెండేళ్లుగా కాపురం అనోన్యంగా సాగిం ది. ఈ క్రమంలో గత ఆరు నెలల నుంచి వరకట న్నం తేవాలని అత్తింటివారు వేధిస్తున్నారు. భర్త మాదన్న, అత్తమామలు మరియమ్మ, యేసన్న, బావవదినలు చంద్రశేఖర్, చిన్నారి ఆమెను కట న్నం తేవాలని చిత్రహింసలు పెట్టారు. ఈ విషయమై శుక్రవారం ఆశీర్వాదమ్మ, భర్త మాదన్న మధ్య గొడవ జరిగింది. దీంతో విరక్తి చెందిన ఆశీర్వాదమ్మ ఇంట్లో ఇనుప రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృ త్యురాలి తల్లిదండ్రులు నరసన్న, మాణికమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అహో బలం.. నమో నారసింహం

- నాటి 'అహో బలమే' నేటి అహోబిలం
- రేపటి నుంచి ఓబులేశుడి బ్రహ్మోత్సవాలు
- తరలిరానున్న భక్త జనం
- దినదిన ప్రవర్ధమానంగా నారసింహ క్షేత్రం

ఇలపై 108 దివ్యమైన వైష్ణవ క్షేత్రాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖమైనది నవనారసింహులు కొలువైన 'శ్రీ అహోబిల క్షేత్రం'. నల్లమల అడవుల్లో వెలసిన ఈ క్షేత్రం భక్తి ప్రవత్తులకే కాదు ప్రకృతి రమణీయతకు కూడా ఆలవాలం. ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి సంతోషిం చిన ఆదిశేషుడు వయ్యారంగా పవళించాడా అన్నట్లుండే పర్వత శ్రేణి. ఈ పర్వతాల తలభాగంలో వేంకటేశ్వర స్వామి (తిరుమల) నడుముపై నారసింహస్వామి (అహోబిలం), తోకపై మల్లికార్జున స్వామి (శ్రీశైలం) ఆవిర్భవించారని భక్తుల నమ్మకం. – ఆళ్లగడ్డ



ఎగువ అహోబిలం కొండపై వెలసిన ఉగ్రస్తంభం

రాక్షస రాజైన హిరణ్యకశిపుడి రాజ్యం 'అహోబిలం'. తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించేం దుకు హిరణ్యకశిపుడిని సంహరించేందుకు లక్ష్మీనర సింహ స్వామి ఉక్కు స్తంభంలోంచి ఉద్భవించిన స్థలం అహోబిల పుణ్యక్షేత్రం. నృసింహస్వామి ఉగ్ర రూపంలో అవిర్భవించి హిరణ్యకశిపుడిని తన గోళ్లతో చీల్చి చంపినప్పుడు ఆయన బలాన్ని, శక్తిని దేవతలు 'అహో బలం' అని ప్రశంసించడంతో ఈ స్థలానికి ఆ పేరు వచ్చింది. తర్వాత ఆ పేరు అహో బిలంగా మారింది. ఉగ్ర నృసింహస్వామిని పరమశి వుడు 'ఉగ్రం వీరం మహావిష్ణుం' అనే మంత్రం జపించి శాంతింపజేసినట్లు పురాణాలు చెబుతు న్నాయి. అందుకే దిగువ అహోబిలంలో కొలువైన ప్రహ్లాద వరదస్వామిని శాంతమూర్తిగా కొలుస్తారు.

స్వామితో సమానంగా ఆల్వారులకు నిత్య పూజలు

ఎగువ అహోబిలం క్షేత్రంలో జ్వాలా నరసింహ స్వామి, దిగువన ప్రహ్లాద వరదమూర్తులు కొలువై ఉన్నారు. ఎగువన మార్చి 3 నుంచి, దిగువన 4వ తేదీనుంచి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి. ప్రపంచంలో ఏ వైష్ణవ క్షేత్రంలో కూడా వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఒకే అలంకరణ, ఒకే వాహన సేవ లు వరుసగా రెండు రోజులు కొనసాగించరు. అది ఒక అహోబిల క్షేత్రానికే ప్రత్యేకం. ముందు రోజు జ్వాలా నరసింహస్వామికి జరిగిన ఉత్సవం, అలం కరణ, వాహన సేవలు మరుసటి రోజు ప్రహ్లాద వర దస్వామికి నిర్వహించడం ఆనవాయితీ. ఎగువ, దిగువ ఆలయాల చుట్టు మహా భక్తులైన ఆల్వార్లు కొలువై ఉన్నారు. వీరికి ముఖ్య వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. లక్ష్మీనరసింహస్వామితో పాటు ఈ మూర్తులకు పూజలు చేసి భక్తులు పరమా నందం పొందనున్నారు.



దిగువ అహోబిలం

బ్రహ్మ ప్రారంభించిన ఉత్సవం

సృష్టికర్త బ్రహ్మ స్వయంగా ప్రారంభించినందున బ్రహ్మో త్సవం అనే పేరు వచ్చింది. బ్రహ్మోత్సవాల్లో వాహనాల ఊరేగిం పు సాగుతుంది. దానికే బ్రహ్మరథం అని పేరు. ఈ రథంలో బ్రహ్మదేవుడు ఉం డి ఉత్సవం నిర్వహిస్తారు.



ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదుడు

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందు స్వామి, అమ్మ వార్ల ఆలయాలను శుద్ధి చేస్తారు. దీన్ని 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం' అంటారు. వార్షిక బ్రహ్మోత్స వాలకు ముందు ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలతో పాటు నవనారసింహ క్షేత్రాల్లో కోయిల్ ఆళ్వార్ తిరుమం జనం నిర్వహించడం ఆనవాయితీ.

విష్వక్సేనుడి పర్యవేక్షణ

శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడి పర్యవేక్షణలో అంకురార్పణ కా ర్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆలయా నికి నైరుతి దిశలో నిర్ణీత ప్రదేశంలో భూదేవి (పట్ట)ని పూజించి, మృత్తికను సేకరించి ఊరేగింపుగా తీసుకొ స్తారు. అలా తెచ్చిన మట్టిలో నవధాన్యాలు మొలకెత్తిం చే కార్యక్రమానికి అంకురార్పణ అని పేరు.

క్షేత్ర విశిష్టత

వైష్ణవ సాంప్రదాయాన్ని విస్తరించేందుకు 11వ శతాబ్దంలో రామానుజచార్యులవారు, అనేక ప్రముఖ ఆళ్వారులు ఈ స్వామిని దర్శించారు. అన్నమాచార్యుడు ఈ స్వామిని దర్శించి కీర్తిం చాడు. వీరేగాక వివిధ సామ్రాజ్యాలకు చెందిన చక్రవర్తులు, రాజులు, నవాబాబు ఈ క్షేత్రాన్ని దర్శించినట్లు శాసనా లున్నాయి. ఈ దేవాలయం, ప్రాకారాలు నిర్మించడా నికి అప్పట్లో 13 సంవ త్సరాలు పట్టినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆది శంకరాచార్యులు పరకాయ ప్రవేశం చేసిన ప్పుడు తన చేతులు లేకుండా పోయినందున ఉగ్ర నరసింహస్వామిని కరాలవంబ స్తోత్రము (శ్రీమత్పయోనిధినికేతన చక్రపాణే..) జపించగా ఆయనకు తిరిగి చేతులు వచ్చాయి. ఈ సన్నివేశం అహోబిలంలో జరిగింది. ఎగువ అహోబిలంలో స్వామి జ్వాలనరసింహుడై స్వయంభూగా అవత రించగా దిగువ అహోబిలంలో వేకంటేశ్వర స్వామి చేత ప్రతిష్ఠించబడి ప్రహ్లాదవరదుడిగా కొలువై కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజి ల్లుతున్నారు.

గరుడుని స్వాగత పత్రిక

లక్ష్మీనరసింహస్వాముల బ్రహ్మోత్సవాలకు సకల దేవ తామూర్తులను ఆహ్వానిస్తారు. స్వామివారి వాహన మైన గరుడి చిత్రాన్ని కొత్త వస్త్రంపై చిత్రీకరిస్తారు. దీ న్నే ' గరుడ ధ్వజపటం' అంటారు. దీన్ని ధ్వజస్తంభం మీద కట్టేందుకు నూలుతో చేసిన కొడితాడును సిద్ధం చేస్తారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సహిత నరసింహస్వామి సమక్షంలో నూతన కేతాన్ని పండి తుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ధ్వజస్తంభంపై ఎగురవేస్తారు. ఆకాశానికెగిసిన గరు డుడు బ్రహ్మోత్సవాలకు రమ్మంటూ ముక్కోటి దేవత లనూ, ఆబాలగోపాలన్ని ఆహ్వానిస్తాడని అర్థం.

లక్ష్మీనృసింహుల వాహనసేవలు

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు కొనసాగుతాయి. ఒక్కో రోజు ఎగువ, రెండు వాహనాల్లో, దిగువ రెండు వాహ నాల్లో స్వామి ఊరేగుతారు. ముందురోజు ఎగువన కొలువైన వాహనాల్లోనే మరుసటి రోజు దిగువన కొలువై ఊరేగుతారు. స్వామివారు అధిరోహించే ఒక్కో వాహనానికి ఒక్కో చరిత్ర ఉంది. ప్రతి వాహనంపై నుంచి స్వామి ఒక్కో సందేశమిస్తారు.

తీర్థవారి చక్రస్నానం

పదో రోజు ఉదయం స్వామి పుష్కరిణిలో చక్ర స్నానం జరుగుతుంది. తొమ్మిది రోజుల పాటు వాహనసేవల్లో అలసిపోయిన స్వామి సేద తీరడా నికి ఈ స్నానం జరిపిస్తారు. వివిధ సుగంధ ద్రవ్యాలతో, ఉభయనాంచారులతో స్వామికి అభి షేక సేవ నిర్వహిస్తారు.

ధ్వజారోహణంతో సమాప్తం

పదో రోజు అర్ధరాత్రి అనంతరం ధజారోహణం జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామి వారి సమక్షంలో బ్రహ్మాది దేవతలకు, అష్టది క్పాలకులకు వీడ్కోలు చెబుతూ గరుడ కేతాన్ని ధ్వజ స్తంభం నుంచి దించుతారు. దాంతో బ్రహ్మోత్స వాలు పరిసమాప్తమవుతాయి.

యాగంటిలో శివదీక్ష విరమణ



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని యాగం టి ఉమామహేశ్వర స్వామి సన్నిధిలో శివమాలధా రుల దీక్ష విరమణ శనివారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి శివ దీక్ష విరమణ గావించారు. ముందుగా పాతపాడు గ్రామం నుంచి తనయుడు శివ నరసింహారెడ్డి, మరికొందరు శివస్వాములతో కలిసి ఇరుముడులు తలపై పెట్టుకొని శివనామస్మ రణ గావిస్తూ పాదయాత్రగా యాగంటి క్షేత్రానికి చేరుకున్నారు. కుటుంబ సమేతంగా శివపార్వతు లకు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి దీక్ష విర మించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, సాయి ప్రసాదరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం శ్రీ ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ ద్వారా భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

దేవర పొట్టేళ్ల కోసం వెళ్తూ మృత్యువాత





మృతి చెందిన పింజరి నబిసాహెబ్, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- తెలంగాణలోని కోదండాపురం వద్ద ఆటోను వెనక నుంచి ఢీకొట్టిన పాల ట్యాంకర్
- ఒకరి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- టి.గోకులపాడులో విషాదచాయలు

కృష్ణగిరి: గ్రామంలో దేవర కోసం పొట్టేళ్లను తీసుకొ చ్చేందుకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఏడుగురికి తీవ్రగాయాల య్యాయి. వివరాలు.. మండలంలోని టి.గోకులపా డులో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు గ్రామదే వతల దేవర నిర్వహించనున్నారు. దేవరలో అమ్మ వార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకునేం దుకు పొట్టేళ్ల కోసం గ్రామానికి చెందిన 20 మంది రెం డు ఆటోల్లో శనివారం ఉదయం తెలంగాణలోని పెబ్బేరు సంతకు బయలుదేరారు. అలంపూర్ దాటిన తరువాత కోదండాపురం వద్ద వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన పాల ట్యాంకర్ ఓ ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న పది మందిలో పింజరి నబీ సాహెబ్ (53) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగ తావారిలో నాగరాజు, లాల్‌స్వామికి తీవ్ర గాయాల య్యాయి. మరో ఐదుగురికి రక్తగాయాలు కావడంతో వెంటనే 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామి రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిం చాలని డాక్టర్లను కోరారు. బాధిత కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ ఘటనతో గ్రామంలో విషాధచా యలు అలుముకున్నాయి. మృతుడికి భార్య మస్తానమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పేందుకు వెళ్తున్న ఫైర్ సిబ్బంది

అవుకు: మండల పరిధిలోని మారుమడుగుల గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి గ్యాస్ లీకై మంటలు చేలరేగాయి. దీంతో గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అగ్ని ప్రమాదంలో రూ.5 లక్షలు ఆస్తి నష్టం జరిగిం దని బాధితులు వాపోయారు.

పీజీ పరీక్షలో కేఎంసీ విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో మొదటి మూడు ర్యాంకులు కైవసం



డాక్టర్ డి.విష్ణు శ్రీకర్‌రెడ్డి



డాక్టర్ ఎ.తేజేశ్వర్‌రెడ్డి



డాక్టర్ పి.వెంకట శివనాగజ్యోతి

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పీజీ వార్షిక పరీక్షలో కర్నూలు మెడికల్ కాలేజి జనరల్ సర్జరీ విభాగం వైద్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కన పరిచి మొదటి మూడు ర్యాంకులు కైవసం చేసుకు న్నారు. వీరిలో మొదటి ర్యాంకును డాక్టర్ డి.విష్ణుశ్రీక ర్‌రెడ్డి 800 మార్కులకు 613, రెండో ర్యాంకును డాక్టర్ ఎ.తేజేశ్వర్‌రెడ్డి 610 మార్కులను, మూడో ర్యాంకును డాక్టర్ పి.వెంకటశివనాగజ్యోతి 602 మార్కులను సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెం డెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అభినందించారు. ఒకే మెడికల్ కాలేజీ విద్యార్థులు మొదటి మూడు ర్యాం కులు సాధించడం రికార్డు అని జనరల్ సర్జరీ ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ పి.హరిచరణ్ తెలిపారు.

రూ.5 లక్షల వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీ

- వెబ్‌నార్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ



హాజరైన అధికారులు, రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): ఏడాదిలోపు చెల్లించే వ్యవ సాయ రుణాలపై 7 శాతం వడ్డీరేటు ఉందని, గడువులోపు చెల్లించిన రైతులకు 3 శాతం వడ్డీ రాయితీని కేంద్రం ఇస్తోందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. వడ్డీ రాయితీ ఇప్పటి వరకు రూ.3లక్షల వరకు మాత్రం ఉందని, ఇక నుంచి రూ.5 లక్షల వరకు లభిస్తుందన్నారు. శనివారం న్యూఢిల్లీ నుంచి వెబ్‌నార్‌లో ప్రధాని మాట్లాడారు. కర్నూలు ఉద్యా నభవన్‌లో జరిగిన వెబ్‌నార్‌కు రైతులు, అధికా రులు హాజరయ్యారు. వెబ్‌నార్‌లో ప్రధాని మాట్లా డుతూ.. రైతుల సంక్షేమం లక్ష్యంగా కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) ద్వారా వ్యవసాయ రుణ వడ్డీ రాయితీ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచామ న్నారు. వ్యవసాయంపై మరింత నమ్మకాన్ని పెం చేందుకు కేసీసీ దోహదపడుతుందన్నారు. ఈ అవ కాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఎల్‌డీఎం రామచంద్రరావు మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో డిసెంబరు నాటికి కేసీసీ కింద 4.04 లక్షల మంది రైతులకు రూ.6,985 కోట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవ సాయ యంత్రాలు పొందేందుకు కేసీసీ పనికొస్తుం దన్నారు. పాడి రైతులు, చేపల పెంపకం చేపట్టిన వారందరూ కిసాన్ క్రెడిట్ కార్డుల కింద రుణాలు పొందవచ్చన్నారు. బ్యాంకుల నుంచి తీసుకునే కేసీసీ రుణాలపై రూ.5 లక్షల వరకు వడ్డీ రాయితీ ఉన్న విషయాన్ని రైతుల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లా లనేది ప్రధాని లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమం లో నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, వ్యవసాయ అను బంద శాఖల అధికారులు, వివిద బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదం

- అనుమతి లేకుండా ఎల్‌ఎల్‌సీ కాలువ నీరు కర్ణాటక రిజర్వాయర్‌కు మళ్లింపు
- అడ్డుకున్న అధికారులు



కర్ణాటక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎల్‌డీఓ హాసన్‌బాషా, జేఈ దుర్గాప్రసాద్

హాలహర్వి: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య జల వివాదం కొనసాగుతోంది. తుంగభద్ర దిగువ కాలువ నీటిని అనుమతి లేకుండా కర్ణాటక రిజర్వా యర్‌కు మళ్లించేందుకు జేసీబీలతో ఎల్లెల్సీ ఆంధ్ర సరిహద్దు 135వ కి.మీ. వద్ద తవ్వుతున్నారు. విషయం తెలుసుకున్న తుంగభద్ర డ్యాం అధికా రులు ఎల్‌డీఓ హాసన్‌బాషా, జేఈ దుర్గాప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మోకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువగట్టు తవ్వకం పనులు నిలిపి వేశారు. నీరు లేక కర్ణాటక ఎర్రగుడి రిజర్వా యర్ ఎండిపోయింది. తాగునీటి సరఫరా కోసం ఎల్‌ఎల్‌సీ కాలువ నుంచి రిజర్వాయర్‌కు మళ్లిస్తు న్నామని కర్ణాటక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలి పారు. అయితే ఆంధ్ర నీటి వాటాను అనుమతి లేకుండా కాలువ గట్టును తవ్వడం నేరమని డ్యాం అధికారులు, ఎస్‌డీఓ హాసన్‌బాషా, జేఈ దుర్గాప్రసా ద్‌లు కర్ణాటక అధికారులతో వాగ్వాదం చేశారు. వెం టనే కాలువ తవ్వకం పనులు నిలిపివేయాలని ఆదే శించారు. కలెక్టర్ అనుమతి తీసుకోవాలని డ్యాం అధికారులు కర్ణాటక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. దీంతో కాలువ తవ్వకం పనులు నిలి పివేశారు. విషయం తెలుసుకున్న బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర కాలువ గట్టును తవ్వకుండా మోటార్ల ద్వారా రిజర్వాయర్‌కు నీరు మళ్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో కాలువ తవ్వకం పనులు నిలిపివేసి మోటార్ల ద్వారా రిజర్వాయర్‌కు నీరు మళ్లిస్తున్నారు.